క్లుప్తంగా

వినూత్న రీతిలో అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మందమర్రిరూరల్/రామకృష్ణాపూర్: హెల్మెట్ వాడకంపై రామకృష్ణాపూర్, మందమర్రి పోలీసులు వినూత్న రీతిలో అవగాహన కల్పిస్తున్నారు. బుధవారం రామకృష్ణాపూర్ కుర్మపల్లిస్టేజీ వద్ద, మందమర్రిలోని టోల్‌గేట్ వద్ద హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపిన వారితోనే ప్లకార్డులు పట్టించి హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. రామకృష్ణాపూర్ పట్టణ ఎస్సై రాజశేఖర్, మందమర్రి ఎస్సై రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు

బెల్లంపల్లిరూరల్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి మండలంలోని పాతబెల్లంపల్లి గ్రామానికి చెందిన గెల్లె వంశీ ఇల్లు బుధవారం కూలింది. ఇల్లు కూలిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. రెవెన్యూ అధికారులు వివరాలు సేకరించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు కారుకూరి రాంచందర్ ఇంటిని పరిశీలించి బాధితుడికి అండగా ఉంటామన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు.

పాఠశాలలో షార్టుసర్క్యూట్

కోటపల్లి: మండలంలోని ఆన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు పాఠశాలలో వర్షపు నీటితో విద్యుత్ షార్ట్‌ సర్క్యూట్ జరిగి పాఠశాల బోరు మోటారు కాలిపోయింది. విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. పాఠశాలలో సుమారు 65మంది విద్యార్థులుండగా, కాలిపోయిన మోటార్‌తో పాఠశాలలో నీటి సమస్య ఏర్పడింది. దీంతో హెచ్‌ఎం రమేశ్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకవెళ్లి తాత్కాలిక మరమ్మతులు చేయించినట్లు తెలిపారు.

మున్సిపల్, పబ్లిక్ హెల్త్ డీఈఈల బదిలీ

మంచిర్యాలటౌన్: ప్రభుత్వం నిర్వహిస్తున్న సాధారణ బదిలీల్లో భాగంగా మంచిర్యాల మున్సిపాలిటీలోని ఇంజనీరింగ్ విభాగంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న పి.మధుకర్‌ను మంచిర్యాల పబ్లిక్ హెల్త్ డీఈఈగా బదిలీ చేయగా, ఆయన స్థానంలో ఆదిలాబాద్ మున్సిపాలిటీ డీఈఈగా పనిచేస్తున్న ఎండి మసూద్ అలీని బదిలీ చేశారు. మంచిర్యాల పబ్లిక్ హెల్త్‌లో పనిచేస్తున్న డీఈఈ టి.శ్రీనివాస్‌ను కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీ చేశారు.

సంఘం బలోపేతానికి కృషి చేయాలి

పాతమంచిర్యాల: ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నిర్మాణం చేపట్టి సంఘాల బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శనిగారపు మురళీకృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్టు హాల్‌లో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులతో జిల్లా స్థాయి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా గద్దెల నిర్మాణం చేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యులు మిట్టపల్లి మల్లయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య మాదిగ, స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా ఇన్‌చార్జి సీహెచ్.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలి



మాట్లాడుతున్న రవి

బెల్లంపల్లి: వర్షాల వల్ల నష్టపోయిన రైతులు, ప్రజలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్.రవి డిమాండ్ చేశారు. పట్టణ సీపీఎం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చాలా చోట్ల వర్షాలు, వరదల వల్ల రోడ్లు తెగిపోయాయని వెంటనే మరమ్మతులు చేయించి రవాణా వ్యవస్థను మెరుగుపర్చాలన్నారు. ముంపు ప్రాంతాల్లో ప్రభుత్వ అధికారులు పర్యటించి ప్రజలకు సహాయక చర్యలు చేపట్టాలన్నారు. నీట మునిగిన పత్తి, ఇతర రకాల పంటల నష్టాన్ని అంచనావేసి పరిహారం కోసం సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్లు కూలిపోయిన బాధితులకు పున:రావాసం కల్పించాలన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ప్రకాష్, నాయకులు జి.అశోక్, రమణ, దేవదాస్, శ్రీనివాస్, మహేష్, సజీవన్, మోహన్ పాల్గొన్నారు.

గుంతల రోడ్లు.. ప్రయాణికుల పాట్లు





భీమారం: మంచిర్యాల–చెన్నూర్ జాతీయ రహదారిలోని భీమారం సమీపంలో రోడ్డు గుంతలమయం కావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. గత సంవత్సరం నుంచి ఇదే పరిస్థితి ఉన్నా నేషనల్ హైవేస్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా నేషనల్ హైవేస్ అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడ్డ గుంతలు పూడ్చి మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.



బెల్లంపల్లి: మున్సిపాలిటీలోని ప్రధాన, అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. వర్షాలకు చెదిరిపోయి గుంతలుపడి రాకపోకలు సాగించకుండా ఉన్నాయి. ఇటీవల అక్కడక్కడ గుంతలు పూడ్చడానికి చర్యలు తీసుకున్నా, మూడు రోజుల క్రితం భారీగా కురిసిన వర్షానికి గుంతల్లోని కంకర కొట్టుకుపోయి మళ్లీ గుంతలు ఏర్పడ్డాయి. బూడిదగడ్డ చౌరస్తా వద్ద మూడు వైపుల గుంతలు ఉన్నాయి. వీటిని పూడ్చడంలో కొంతకాలం నుంచి మున్సిపల్ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. మున్సిపాలిటీలోని 34వార్డుల్లోని బస్తీల్లో ఉన్న అంతర్గత రోడ్లు కూడా దయనీయ స్థితిలో ఉన్నాయి. మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు చిత్తశుద్ధితో వ్యవహరించి రోడ్ల మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బురద రోడ్డుపై నాటేసి నిరసన

నెన్నెల: వర్షాలకు మడలంలోని కుశ్నపల్లి గ్రామంలో దళితవాడ రోడ్లు బురదమయంగా మారాయని ఆ కాలనీ మహిళలు వినూత్నంగా నిరసన తెలిపారు. బురదమయమైన రోడ్లపై నాట్లు వేశారు. వర్షాకాలంలో రోడ్లన్నీ చిత్తడిగా మారుతున్నాయని ఆందోళన చేపట్టారు. గ్రామంలో చెత్త పేరుకుపోయి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, నాయకులకు అనేకసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. విసిగిపోయిన తాము బురద రోడ్డుపై నాట్లు వేసి నిరసన తెలపాల్సి వచ్చిందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లు ,డ్రెయినేజీ నిర్మించి ఇబ్బందులు తీర్చాలని కోరారు.



కుశ్నపల్లిలో నిరసన తెలుపుతున్న మహిళలు

అక్షరం నేర్వాలంటే కష్ట పడాల్సిందే..!



మంచిర్యాలఅర్బన్: స్థానిక గాంధీనగర్ సినిమావాడ పాఠశాలకు వెళ్లి అక్షరాలు నేర్వాలంటే విద్యార్థులు అష్టాకష్టాలు పడాల్సి వస్తుంది. వర్షం పడితే చాలు ఇబ్బంది తప్పటం లేదు. దాదాపు 13ఏళ్ల కిందట కొత్త భవనం నిర్మించి పాఠశాలను తరలించినా, రహదారి సౌకర్యం లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు నానా పాట్లు పడాల్సి వస్తుంది. ఈ పాఠశాలలో 192మంది చదువుతున్నారు. దాదాపు కిలోమీటరుపైన రహదారి బురదమయంగా ఉంటుందని, రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

రోటిగూడ వంతెనకు మోక్షమెప్పుడో..?



రోటిగూడకు వెళ్లే దారిలో బీటీ రోడ్డుపై నుంచి పారుతున్న వాగునీరు(ఫైల్)

జన్నారం: ఏళ్లుగా గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నా, సమస్యకు పరిష్కారం లభించడం లేదు. ప్రధాన రహదారి నుంచి రోటిగూడ గ్రామానికి వెళ్లే దారిలో గల ఒర్రె పొంగడం వల్ల రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఏటా గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు గాని, ప్రజాప్రతినిధులు గాని పట్టించుకోవడం లేదనే విమర్శలు వినవస్తున్నాయి. ఇప్పటికైనా వంతెన మంజూరు చేసి సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

వర్షపు నీరు నిలుస్తోంది..!

చెన్నూర్‌రూరల్: మండలంలోని కాచన్‌పల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని తరగతి గదుల ఎదుట వర్షపు నీరు నిలుస్తోంది. దీంతో విద్యార్థులు తరగతి గదుల్లోకి వెళ్లేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకొని పాఠశాల ఆవరణలో నీరు నిల్వకుండా చూడాలని విద్యార్థులు, స్థానికులు కోరుతున్నారు.



ధరణి సహాయక కేంద్రాలు ఏర్పాటు



భీమారం: హెల్ప్‌డెస్క్ ప్రారంభిస్తున్న తహసీల్దార్



హాజీపూర్‌లో...

మంచిర్యాలరూరల్(హాజీపూర్)/జైపూర్/భీమారం/తాండూర్: ధరణి పోర్టల్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యల దృష్ట్యా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశాల మేరకు తహసీల్దార్ కార్యాలయాల్లో బుధవారం ధరణి సహాయక కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రజలు ధరణి హెల్ప్‌డెస్క్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని, ఎలాంటి భూ సమస్యలు ఉన్నా మీ సేవా కేంద్రంలో దరఖాస్తు చేయక ముందే ధరణి సహాయక కేంద్రాన్ని సంప్రదించాలని తహసీల్దార్లు కోరారు. ఆయా మండలాల్లో జైపూర్‌లో తహసీల్దార్ వనజారెడ్డి, హాజీపూర్ తహసీల్దార్ సతీశ్‌కుమార్, భీమారంలో తహసీల్దార్ సదానందం, తాండూర్‌లో తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్ ప్రారంభించారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఏరియా జీఎం మనోహర్

మందమర్రిరూరల్: సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో పలు కోర్సుల్లో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏరియా జీఎం మనోహర్ అన్నారు. ఏరియా సేవా సమితి అధ్యక్షురాలు, జీఎం సతీమణి సవిత మనోహర్ ఆధ్వర్యంలో బుధవారం ఏరియాలోని సీఈఆర్ క్లబ్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరై కోర్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. సింగరేణి పరిసర ప్రాంత నిరుద్యోగ, సింగరేణి ఉద్యోగుల వారసులకు ఉచితంగా ఇస్తున్న శిక్షణను శ్రద్ధతో నేర్చుకుని శిక్షణ అనంతరం ఉపాధి పొందాలని సూచించారు. ఇదివరకు పలు కోర్సుల్లో శిక్షణ పొందిన వారికి పరీక్ష నిర్వహించి పాసైన 187మంది మహిళలకు ధృవపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏరియా పర్సనల్ మేనేజర్ సల్ల శ్యాంసుందర్, డీవైపీఎం ఆసిఫ్, అనసూయ, ఖాదీ, విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు రీజనల్ ఆఫీసర్, సింగరేణి సేవా సమితి కోఆర్డినేటర్ శివకుమార్, ఖాదీ గ్రామోద్యోగ్ మహా విద్యాలయ్ డీవో నరేష్, సేవా సమితి కోచింగ్ ఫ్యాకల్టీ, యూనియన్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ పాటించాలి



పరిసరాలు పరిశీలిస్తున్న గణపతి

జైపూర్: అంగన్‌వాడీ కేంద్రాల్లో 100శాతం పిల్లలు కేంద్రాలకు వచ్చేలా చూడాలని, పిల్లలకు అందించే భోజనం మెనూ తప్పకుండా పాటించాలని మండల ప్రత్యేక అధికారి, జెడ్పీ సీఈవో గణపతి తెలిపారు. మండలంలోని పెగడపల్లి, గంగిపల్లి, ఎల్కంటి గ్రామాల్లో గల అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు ప్రభుత్వ పాఠశాలలను ఆయన బుధవారం ఎంపీడీవో సత్యనారాయణతో కలిసి సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్య, వారికి అందిస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. అనంతరం షెట్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను పరిశీలించి అమ్మ–ఆదర్శ పాఠశాలల అభివృద్ధిలో భాగంగా పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని, సంబంధిత కాంట్రాక్టర్లకు సూచించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు.

సంక్షిప్త వార్తలు

పారిశుద్ధ్యం మెరుగుపరచాలి

శ్రీరాంపూర్: వర్షాకాలం సీజన్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, కావున యాజమాన్యం పారిశుధ్యంను మరింత మెరుగుపరచాలని బీఎంఎస్ కేంద్ర ఉపాధ్యక్షుడు చాట్ల అశోక్, కార్యదర్శులు రాగం రాజేందర్, ప్రభాకర్, ఏరియా ఉపాధ్యక్షులు నాతాతి శ్రీధర్ రెడ్డి, సెక్రెటరీ కట్ట ఈశ్వరాచారి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలి

కాసిపేట: విద్యార్థులు చదువుతో పాటు సంప్రదాయకమైన ఆటలు, అన్ని రంగాల్లో ముందుండాలని దేవాపూర్ జిల్లా పరిషత్ హెచ్‌ఎం రమేశ్ రాథోడ్ తెలిపారు. పాఠశాలలో బుధవారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన శిక్ష సప్తహ కార్యక్రమం మూడో రోజులో భాగంగా విద్యార్థులకు వివిధ సంప్రదాయకమైన స్వదేశీ ఆటలు ఆడించారు.

బదిలీపై వెళ్తున్న కార్యదర్శులకు సన్మానం

భీమిని/నెన్నెల: కన్నెపల్లి మండలంలోని కన్నెపల్లి కార్యదర్శి అభిలాష్, నెన్నెల మండలంలోని నందులపల్లి కార్యదర్శి పద్మనాభం బదిలీపై వెళ్తున్నందునా వారి సేవలను గుర్తించి వారిని గ్రామ ప్రజలు, నాయకులు, అధికారులు సన్మానించారు.

ఆశ కార్యకర్త కుటుంబాన్ని ఆదుకోవాలి

దండేపల్లి: మండలంలోని సర్పాపూర్‌కు చెందిన ఆశ కార్యకర్త శ్యామల ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ డిమాండ్ చేశారు. బుధవారం ఆమె కుటుంబ సభ్యులను ఆయనతో పాటు, పలువురు ఆశాకార్యకర్తలు పరామర్శించారు.

సేఫ్టీ జీఎంకు సన్మానం

శ్రీరాంపూర్: ఈ నెలాఖరుతో ఉద్యోగ విరమణ పొందుతున్న కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్యను జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం జీఎం సంజీవరెడ్డి, బెల్లంపల్లి రీజి యన్ సేఫ్టీ జీఎం రఘుకుమార్ శాలువాతో సత్కరించారు.

బీజేపీ మండల కార్యవర్గ సమావేశం

కాసిపేట: మండలంలోని చిన్నధర్మారంలో బుధవారం బీజేపీ మండల కార్యవర్గ సమావేశాన్ని కాసిపేట మండల అధ్యక్షుడు సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి, మండల ఇన్‌చార్జి కేశవరెడ్డి, అధికార ప్రతినిధి పాల్గొని కాసిపేట మండలంలోని సమస్యల కోసం చర్చించారు. సమస్యల పరిష్కారానికి బీజేపీ ముందుండి పోరాటం చేస్తుందన్నారు.

నేడు రాత పరీక్ష

శ్రీరాంపూర్: సింగరేణి సేవాసమితి ఆధ్వర్యంలో అందించిన వృత్తి కోర్సుల్లో శిక్షణ పొందిన మహిళలకు నేడు రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు డీజీఎం పర్సనల్ అరవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరాంపూర్, నస్పూర్ కాలనీలోని సేవా కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. 2023–24ఆర్థిక సంవత్సరంలో 477మందికి శిక్షణ ఇచ్చామని, వారంతా నేడు పరీక్షకు హాజరు కావాల్సిందిగా తెలిపారు.

బాధ్యతల స్వీకరణ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఇటీవల ఉద్యోగుల బదిలీల్లో భాగంగా నూతన అధికారులు బదిలీపై రాగా అందరూ బాధ్యతలు తీసుకుని విధుల్లో చేరారు. హాజీపూర్ ఎంపీపీ కార్యాలయ సూపరింటెండెంట్‌గా బాలకృష్ణ, సీనియర్ అసిస్టెంట్‌గా కొండయ్య, జూనియర్ అసిస్టెంట్ అరుణ్, టైపిస్ట్ రాజశ్రీ,, కార్యాలయ సబ్ ఆర్డినేట్ సుమిత్‌లు బదిలీపై రాగా రెగ్యులర్ విధుల్లో చేరారు. జిల్లా వ్యాప్తంగా జూనియర్ అసిస్టెంట్‌ల బదిలీలు జరిగినప్పటికీ వారికి పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగించలేదు. వీరిని డెప్యూటేషన్‌లపై ఖాళీలు ఉన్న చోటకు బదిలీ చేయనున్నట్లు తెలిసింది.

భీమారం: మండల ఇన్‌చార్జి ఎంపీడీవోగా సత్యనారాయణగౌడ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో రాధారాథోడ్‌ని నిర్మల్‌కు బదిలీ చేశారు. జైపూర్ ఎంపీడీవోగా పనిచేస్తున్న సత్యనారాయణ గౌడ్‌కి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్వర్వులు జారీ చేశారు.

'విద్యారంగ ప్రాధాన్యతను విస్మరించిన ప్రభుత్వం'

మంచిర్యాలఅర్బన్: జాతీయ విద్యావిధానం 2020 ద్వారా గొప్ప మార్పులు తెస్తామని గొప్పలు చెప్పిన కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయింపుల్లో చిత్తశుద్ధి లేదని డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేష్, జయకృష్ణ ఆరోపించారు. విద్యారంగానికి 2.6శాతం నిధులు కేటాయించటం చూస్తే ఎంత శ్రద్ధ ఉందో అర్థమవుతుందన్నారు. ఆదాయం పన్నులో కూడా మధ్య తరగతి వేతన జీవులకు నిరాశనే మిగిల్చుతుందన్నారు.

వాల్యూవేషన్ సర్టిఫికెట్ ఇవ్వాలి

బెల్లంపల్లి: ప్రభుత్వం జారీ చేసిన ఇళ్ల స్థలాల పట్టాలకు బెల్లంపల్లి మున్సిపల్ అధికారులు వాల్యూవేషన్ సర్టిఫికేట్లు ఇవ్వడం లేదని బీఎంఎస్ జిల్లా కార్యదర్శి వెంగళ రాయమల్లు ఒక ప్రకటనలో తెలిపారు. చట్టబద్ధంగా పట్టాలు జారీ చేసినప్పుడు వాల్యూవేషన్ సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం వెనుక ఆంతర్యమేమిటో వెల్లడించాలని తెలిపారు.

సెల్‌ఫోన్ల అప్పగింత

జన్నారం: మండలంలోని పొనకల్‌కు చెందిన అజయ్‌కుమార్ 30 జూలై 2023న, జాడి సత్యనారాయణ 19 జూలై 2023న ఫోన్ పోగొట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా సీఈఐఆర్ పోర్టల్ సాయంతో కనుగొని బుధవారం ఎస్సై రాజవర్ధన్ బాధితులకు ఫోన్లు అప్పగించారు.

దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలి

• కలెక్టర్ కుమార్ దీపక్



వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

కాసిపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మండలంలోని ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం తనిఖీ చేసి రికార్డులు, రిజిస్టర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేసి దరఖాస్తుల ప్రక్రియ వేగవంతం చేసినట్లు తెలిపారు. అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి పర్యవేక్షిస్తూ మరింత వేగవంతం చేయాలన్నారు. భూ సమస్యలపై ధరణి పోర్టల్‌లో అందిన దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలించాలని, దరఖాస్తుతో జతపరిచిన డాక్యుమెంట్‌లు పరిశీలించాలన్నారు. తహసీల్దార్ పరిధిలో పరిష్కారం అయ్యే సమస్యలు త్వరగా పరిష్కరించాలని, తమ పరిధిలో లేని వాటిని ఆర్డీవో, కలెక్టర్లకు పంపించి వీలైనంత త్వరగా పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆస్పత్రి ఆవరణ, వార్డులు, ఫార్మసీ, రికార్డులు పరిశీలించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉంటూ అవసరమైన మందులు అందుబాటులో నిల్వ ఉంచుకోవాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, మండల ప్రత్యేకాధికారి గంగారాం, తహసీల్దార్ భోజన్న, ఎంపీడీవో సత్యనారాయణసింగ్, ఎంపీవో షేక్ సబ్దర్‌అలీ, వైద్యాధికారి రవికిరణ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించండి

• డీఆర్‌డీవో కిషన్



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఆర్‌డీవో

జన్నారం: వర్షాల వల్ల గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించే అవకాశం ఉందని, గ్రామ పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులపై దృష్టి సారించాలని డీఆర్‌డీవో, మండల ప్రత్యేక అధికారి కిషన్ అన్నారు. మండలంలోని పొనకల్, జన్నారం గ్రామాల్లో బుధవారం పర్యటించారు. పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. రోడ్డుపై నీరు నిలువకుండా చూడాలని, అవసరమున్న చోట బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, డ్రెయినేజీలు శుభ్రం చేసి, అవసరమున్న చోట ఆయిల్‌బాల్స్ వేయాలని, వాటర్ ట్యాంకులను నిర్ణీత సమయంలో క్లోరినేషన్ చేయాలని సూచించారు. తప్పకుండా ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. వర్షాకాలంలో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా వైద్య సిబ్బందితో కో ఆర్డినేట్ కావాలన్నారు. వర్షాల హెచ్చరికల దృష్ట్యా లోతట్టు ప్రాంతాల్లో సిబ్బంది ఉండాలని సూచించారు. అనంతరం అక్కపెల్లి గూడ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారితో కలిసి వనమహోత్సవంలో పాల్గొన్నారు. ఆయన వెంట ఎంపీడీవో శశికళ, ఏపీవో రవీందర్, ఏపీవో రమేశ్, కార్యదర్శి రాహుల్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ తదితరులున్నారు.

ఘనంగా కేటీఆర్ పుట్టినరోజు వేడుకలు



కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

భీమారం/జన్నారం/కాసిపేట/చెన్నూర్/లక్సెట్టిపేట/రామకృష్ణాపూర్/నస్పూర్/మందమర్రిరూరల్: బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామారావు పుట్టినరోజు వేడుకలను జిల్లా వ్యాప్తంగా బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. చెన్నూర్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.నస్పూర్ మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు సుమారుగా 50మంది రక్తదానం చేశారు. మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ అభివృద్ధి కేవలం బీఆర్‌ఎస్‌కే సాధ్యమైందని, రానున్న రోజుల్లో మళ్లీ బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. లక్సెట్టిపేటలో మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ నాయకులు, అనుబంద సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మించడం హర్షణీయం

జైపూర్: మండల కేంద్రంలో గల సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో కాంట్రాక్టు కార్మికుల సౌకర్యార్థం ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మించడం హర్షణీయమని ఐఎన్‌టీయూసీ నాయకులు పేరం రమేశ్ తెలిపారు. నూతనంగా సీఎండీగా బాధ్యతలు స్వీకరించిన ఎన్.బలరాం కాంట్రాక్టు కార్మిక సమస్యలపై దృష్టిసారించడం, కార్మికులపై ఆయన చూపుతున్న శ్రద్ధ ఫలితంగానే ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు అవుతుందన్నారు. కాంట్రాక్టు కార్మికులకు సైతం రూ.30లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించడానికి ప్రత్యేకంగా కృషి చేశారని, ఆయనకు కాంట్రాక్టు కార్మికుల తరుపున, ఎస్టీపీపీ కార్మికుల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎస్టీపీపీ జీఎం శ్రీనివాసులును కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఆయనతో ఎస్టీపీపీ ఇన్‌చార్జి రాకేశ్‌గౌడ్, నాయకులు మధు, శ్రావణ్, లింగయ్య, రమేశ్, తిరుపతిరెడ్డి, నరేశ్, రాజేందర్, తదితరులు ఉన్నారు.